వీ రా భి షే క ము

ఏ కాం కి క

డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య, M. A., Ph. D.

ప్రకాశకులు

నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్,

హైదరాబాదు - 500 084. ఫోన్ నెంబర్ : 9440495887,9866115177

(Digitised 23 April 2026)

Veerabhishekam

(A Drama)

by **Dr.Nanduri Ramakrishnamacharya**

డిజిలిటీకరణ పర్య వేక్షణ : నండూరి గోవింద రాజు

ప్రతులకు : 1. నండూరి గోవింద రాజు, ప్లాట్ నం .:423,
రాజరాజేశ్వరి నగరు, కొండాపూర్
హైదరాబాద్ -500084.
Cell -9440495887.

Web Site : can down load digital copies at
nanduri.co.in

సర్వ హక్కులు (Copy Rights) : నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

కృతిసమర్పణము

మిత్రశ్రీ
డాక్టర్ పొన్నపల్లి సుబ్రహ్మణ్యంగారికి

అంకితమగుత చిరస్నే
హాంకము స్వర్ణోత్సవోపహార స్రజమై
సంకలనముగా నా యే
కాంకికలు నవభువనవిజయాధ్యాతునకున్.

రాజువుగావుగాని, నటరాజువు నాటకరంగమందు, ఉ
త్తేజమునం, దుదారగుణదీధితి, రాజసతీవియందు ఏ
రాజుకు తీసిపోవు; అనురక్తిని ఈ కృతి గొమ్ము, స్వర్ణ నీ
రాజన మంగళాశిష విరాజన జన్మదినోత్సవమ్ములో.

నీ మది చంద్రికా తరళ నిత్యవసంతమనోజ్ఞ నంద నా
రామము; దివ్యసౌరభ నిరంతర నాట్యకళాప్రపుల్లమున్;
కోమలభావవీచికలకున్ గిలిగింతలు పెట్టు ఈ పూరా
రామము నీదు పేరున విరాజిలెడిన్ ప్రతిబింబసామ్యమై.

నివేదన

I

"వీరాభిషేకం" ఏకాంకిక 'దశరూపకములు' సంపుటిలో ఒకటి. వీరాభిషేకం, త్యాగరాజు గద్య పద్య సంకలితాలు. మిగతా ఏకాంకికలలో జ్యోత్స్నాభి సారిక, గోదావరి సంగమం నృత్యనాటికలు. గీతకత్తిలో రెండే పాత్రలు. గీతకత్తి, ఉరికంబం, తమ్ముడు, పద్యంగాని పాటగాని లేని పోడిమాటల ప్రోగులు. మరణాంతకం వట్టి ప్రహసనం. ఈ ఏకాంకికలలో ప్రస్ఫుటంగా కనిపించే వైవిధ్యంలో రచయిత ఆత్మీయత వినా, ఏకత్వం మృగ్యం.

II

తెలుగుగడ్డ — అవహేళనరూపకం (Satire). ఈ అభూత కల్పన చదివిన దేశభక్తులకు రచయితపై కోపం రావచ్చు. వారిని రచయిత ఉమాభిత అర్థిస్తున్నాడు. కాని, ఒక మనవి. ఆత్మనిష్ఠ మైన అవహేళన ఆరోగ్యలక్షణం. అదిగాక తెలుగుగడ్డలో అవహేళనపూర్వకంగా భాసించే ప్రతి అక్షరం వెనుక రచయిత వేడి కన్నీటిబొట్టు మారువేషంలో దాగియున్నదని మరువవద్దు.

III

ఏ నాటకమైనా ఈ జగన్నాటకంలో అంతర్నాటకమే — అనే అనుభూతి పొందినవాడు జీవన్ముక్తుడే. జగన్నాటకాన్ని మించిన నాటకం ఏముంది కన్నుతెరచి చూడగల సహృదయునికి? వేరే నాటకాలు చదవటం ఎందుకు? ఆడటం ఎందుకు? వ్రాయటం ఎందుకు?

IV

ఈ నాటికలు వ్రాసిన చిరకాలానికి ప్రచురించటానికి కారణం రచయిత కాదని మనవి. ఈ నాటికల రచనకు మిత్రశ్రీ డాక్టర్ పొన్నపల్లి సుబ్రహ్మణ్యం ముఖ్య ప్రేరకుడు. రచనను ప్రోత్సహించి చేసిన తప్పుకు ముద్రణభారం వహించి, ప్రచురించటం నిష్కృతి కాబోలు.

V

ఈ ఏకాంకికలు చదివి, ఎవరూ విలువగల తమ కాలాన్ని వెచ్చించవద్దని రచయిత హృదయపూర్వకమైన మనవి. ఒకవేళ పొరపాటున చదివినా ప్రదర్శించుటకు పూను కోవద్దని రచయిత సలహా. ప్రదర్శించేవారు తమకాలాన్నే గాక ప్రేక్షకుల అమూల్య కాలమునుగూడ దుర్వినియోగం చేసినవారవుతారని, అందుకు రచయిత ఎంతమాత్రమూ బాధ్యుడు కాదని హెచ్చరించుచున్నాను.

నండూరి రామకృష్ణమాచార్య

వీరాభిషేకము

భూమికలు:

1. కర్ణుడు
2. దుర్యోధనుడు
3. ద్రోణుడు
4. అర్జునుడు
5. భీముడు
6. వంది మాగధులు
7. స్వస్తివాచకులు

వీరాభిషేకము

వంది మాగధులు: శ్రీ శ్రీ శ్రీ శ్రీమన్మహారాజరాజశ్రీ కౌరవ కులాలంకారా! భారత సామ్రాజ్యచక్రవర్తీ! విచిత్రవీర్య తనయా! శ్రీ ధృతరాష్ట్ర సార్వభౌమా! జై జై జై.

శ్రీ శ్రీ శ్రీ శ్రీమన్మహారాజరాజశ్రీ కౌరవకుల భూషణా! ప్రతిజ్ఞా పరిపాలన భీష్మా! జగదేకధనుర్ధరా! మందాకినీ నందనా! దేవవ్రత మహారాజా! జై జై జై!

రాజకుమారులు: గురుదేవులు శ్రీ ద్రోణాచార్య చరణార విందములకు నమస్కారములు; నమస్కారములు.

ద్రోణుడు: బ్రహ్మార్పణమస్తు! కౌరవ రాజకుమారులారా! మన రంగభూమికి

> ***పరశురామునంతటివాని భంగపరచి***
> ***నట్టి జగజెట్టి గంగమ్మపట్టి మీపై***
> ***తాముహూండు వచ్చె; భవద స్త్ర ప్రణతను***
> ***జూడ ధృతరాష్ట్రరాజేంద్రుతోడ నేడు.***

ప్రేక్షకాగారము కిక్కిరిసి కిటకిటలాడుచున్నది. గాంధారీ మహారాజ్ఞి, కుంతిమహాదేవి అంతఃపురంనుండి విచ్చేసినారు. పరిక్షా ముహూర్తం సమీపించింది.

రాజకుమారులు: గురుదేవుల కృపాకటాక్షవీక్షణాలు సర్వం నిర్వహింపగలవు.

ద్రోణుడు: రాజపుత్రులారా! అదుగో, సుముహూర్త ఘుంటారావం. మీకు నా ఆశీస్సులు.

ఈ సమయమ్మునందు ధరణీశ్వరనందనులారా మీరల భ్యా

సము చేసినట్టి వివిధాస్త్రవిదగ్ధ శరప్రయోగవి

న్యాసము జూచి భీష్ముడు మనంబున మెచ్చిన మీ ధనుష్క ళో
పాసన సిద్ధి జెందును, అపారముదం బొనగూడు నా హృదిన్.

రాజకుమారులు: కృతార్థులము; కృతార్థులము.

ద్రోణుడు: మొట్టమొదటి కార్యక్రమము గదాయుద్ధ ప్రదర్శనం.

తెరలో కలకలం

జై కౌరవరాజకుమారులకు జై!

ద్రోణాచార్యగురువర్యులకు జై!

వంది మాగధులు:

భీమసేన దుర్యోధన వీరవరులు
గంధసింధురద్వితయమ్ము కరణి మెరసి
ఉరుకుచున్నారు బరిమోది తీవ్రముగను
మండితోద్దండకరగదాదండులగుచు.

తెరలో

భళీ భీమసేనా! హా దుర్యోధనా! గాంధారీనందనా! భళీ పాండురాజనందనా! హా హా!

ద్రోణుడు: దుర్యోధన భీమసేన రాజపుత్రులారా! మీ గదాయుద్ధకౌశలం అపూర్వం. క్రీడారణం యథార్థ యుద్ధంగా మారింది.

నేటికీ గదాయుద్ధం సమాప్తి.

దుర్యోధన, భీమసేన: మహాప్రసాదం; మహాప్రసాదం.

ద్రోణుడు: రాజనందనులారా! మీరందరు బద్ధతూణీరులై రంగభూమికి రండు.

రాజనందనులు: మహాప్రసాదం.

ద్రోణుడు: అదిగో, ఆ మర్రి చెట్టు చూచారుకదా?

రాజనందనులు: ఆఁ ఆఁ; చూచుచున్నాము.

ద్రోణుడు: చిట్టచిటారుకొమ్మన ఊగులాడే పక్షియంత్రం కనిపిస్తోందికదా?

రాజనందనులు: ఆఁ, కనుపించుచున్నది.

ద్రోణుడు: మీలో ఎవరైనా మారు మాటాడక బాణాలతో ఆ పిట్టతలపై కైగురగొట్టి మొందెం క్రిందపడగొట్టవలెను.

(మౌనం)

ద్రోణుడు: రాజనందనులారా! మీరందరు మౌనముద్ర ధరించారేమి! దుర్యోధనా – బద్ధతూణీరుడ వై బరిమీదికి రా!

దుర్యోధనుడు: మహాప్రసాదం.

ద్రోణుడు: ఆ వటవృక్షం చూచావుకదా?

దుర్యోధనుడు: ఆఁ.

ద్రోణుడు: ఏమి కనిపిస్తోంది?

దుర్యోధనుడు: మర్రి చెట్టు.

ద్రోణుడు: ఇంకా?

దుర్యోధనుడు: కొమ్మలు, రెమ్మలు.

ద్రోణుడు: మఱిం క!

దుర్యోధనుడు: ఊగులాడే పక్షియంత్రం...ఆకులు...

ద్రోణుడు: అన్నీ బాగా కనిపించుచున్నవా?

దుర్యోధనుడు: ఆఁ; సమస్తం కనిపిస్తున్నవి.

ద్రోణుడు: దృష్టి చలిస్తున్నట్లున్నది. బాగా దీక్షతో చూడు.

దుర్యోధనుడు: ఆచార్యవర్యా, నా కింకా దృష్టిమాంద్యం రాలేదు.

ద్రోణుడు: బాగున్నది. నీవు కొట్టినట్లే. నీవు నిష్క్రమింప వచ్చు.

దుర్యోధనుడు: కృతార్థుడను.

ద్రోణుడు: భీమసేనా!

భీముడు: ఆచార్యవర్యులకు నమస్కారం.

ద్రోణుడు: ఆ పక్షియంత్రం చూచావుకదా?

భీముడు: అక్కడ ఊగులాడేది ఏదో అదేనా!

ద్రోణుడు: మరేమి చూచావు? ఆ మర్రి చెట్టుపై నున్న యంత్రం.

భీముడు: ఇంతవరకు తిన్నగా చూడలేదు. ఆ చెట్టును సరీగా చూస్తే ఇదివరకే వేళ్ళతోసహా పెకలించియుండేవాణ్ణి.

ద్రోణుడు: ఇదేమి ఆకారం! పక్షియంత్రం భేదించటానికి ధనుష్పాణివై రంగభూమికి రమ్మంటే గద ఎత్తుకొని వచ్చావు?

భీముడు: ఆ ఊగులాడే కృత్రిమపక్షిపై బ్రహ్మాస్త్రప్రయోగము చేయటం నాచేతగాదు. కావలసిన ఇదిగో—నా గదాదండంతో కొమ్మ కొమ్మ గభీలున కూలేటట్లు ఒక వేటు వేస్తాను.

ద్రోణుడు: నీకు పుణ్యముంటుంది. మంచివాడవు. నీ వంత పని చేయ్యగలవు. నిన్ను మరోసారి పిలుస్తాను.

భీముడు: మహాప్రసాదం—నన్ను వదిలిపెట్టారు.

ద్రోణుడు: అర్జునా!

అర్జునుడు: శ్రీ ద్రోణాచార్య గురుచరణారవిందములకు పార్థుని నమస్కారాలు.

ద్రోణుడు: బ్రహ్మార్పణమస్తు! కుంతీనందనా! ఆ మర్రి చెట్టు చూచావుగదా?

అర్జునుడు: ఆ.

ద్రోణుడు: ఆ కొమ్మపై పక్షియంత్రం చూడు. ఏం? కనిపి
స్తోంది కదా?

అర్జునుడు: ఆ, కనిపించింది.

ద్రోణుడు: ఏమి - సరిగా చూస్తున్నావా! ఏమి కనిపించింది.

అర్జునుడు: పక్షియంత్రం.

ద్రోణుడు: ఇంకా?

అర్జునుడు: ఇంకేమీ కనిపించటం లేదు.

ద్రోణుడు: ఏమీ? ఇంకేమీ కనిపించటం లేదా? కొమ్మలు, రె
మ్మలు.

అర్జునుడు: లేదు గురువర్యా! లేదు, అనుజ్ఞ ఇచ్చిన.

ద్రోణుడు: సంక్రందననందనా!

పేరుగడించినారు పృథివీపతులందున అస్త్రవిద్యలో
పౌరవరాజవంశనరపాలుడ నాటికి నేటికిన్ జగద్
వీరుడు మీ పితామహుడు భీష్ముడు పెద్దలకీర్తినిల్పి నీ
శూరత రంగమధ్యమున చూపుము, కూల్చుము పక్షియంత్రమున్.

అర్జునుడు: చరితార్థుణ్ణి—(కొట్టును)

తెరలో కలకలము - జయ నినాదాలు

వంది మాగధులు:

ఏడుదీవుల కవ్వలి కెగురునట్లు
ఒక్క కోలతో తలకాయ చిక్క వేసి
కొమ్మపై పక్షియంత్రమ్ము కూల్చినాడు
అర్జునుడు మేటి విలుకాల్రు లగ్గలింప.

ద్రోణుడు: అర్జునా, నీ శిష్యత్వమువల్ల నా గురుత్వముకూడ
సఫలమైంది.

మూడులోకాలలో నీకు ఈడువచ్చు
వాడు లేడు నన్ మెప్పించి నాడ వోయి
మేటి విలువిద్య లోన అ మేయ బలుడ
వగుచు సలుపుము వీర విహార మింక

తెరలో

జై ద్రోణాచార్యులకు జై!

పాండురాజకుమారుడు అర్జునునకు జై!

కర్ణుడు ప్రవేశించి: సభాసదులారా! దండనాథులారా! రాజ గారిసొమ్ముదిను వంది మాగధులకన్న మిన్నగా మీ కీ కంఠ శోష ఎందుకు! ఈ వృథా జయనినాదా లెందుకు!

కరచిన విద్యల్ తిరిగి కౌరవనాథుని మ్రోలగొప్పగా
గురునకు వప్పగింప శరకోవిదుడౌ మొనగాడు వేరె లే
డరయగ మూడులోకములయందు నటంచు వచింతురే ధన
రార్థులకు, ఇంతకంటె కలదా అవమానము రంగభూమిలో.

ద్రోణుడు: మాగధా! ఈ బాలవీర దేవడు!

భారత సార్వభౌమసుతవర్గము చేరి పరిశ్రమించు కే
ళీరణశాల చొచ్చియు చలింపక వింటినిబూని నారి టం
కారమొనర్చి పోరగల గర్వముజూపుచు నిల్చినాడు బా
లారుణరాగ రేఖలు నిజాననసీమను తాండవింపగా.

కర్ణుడు: అస్త్రకళా తారతమ్యనిరూపకనియామకాచార్యా! ధనుర్నిగమాచార్యా! ద్రోణాచార్యా!

ఇంతమాత్రమునకే ఇంతింతలు
పలికి శిష్యునెంత గొప్ప చేసినారు!
అనుమతించిరేని యంత్రమ్ము నొకకోల
నేలగూల్పగలను నేనుగూడ.

ద్రోణుడు: స్వాభిమానధనుర్విద్యాప్రాగల్భ! అదుగో చెట్టుపై యంత్రం. చేతనైన దానిని కొట్టు.

కర్ణుడు: చిత్తం (కొట్టును).

తెరలో

భళీ! జగదేకధనుర్ధరా! అర్జునప్రత్యర్థీ!
అసమానకోదండవిద్యాప్రవీణ! జై! జై!

కర్ణుడు: అర్జునా!

మూడులో కాలలో నీకు ఈడువచ్చు
వాడు లేడు లేడని చాటినాడు గురుడు
ఏకలవ్యుడు పాపము లేకపోయె
కలదు కర్ణుండు సీమందు కాచికొనుము.

అర్జునుడు: పిలువనిదే పెట్టనిదే ఇక్కడకు రావటం, ఈ అధిక ప్రసంగం నాకు అర్థంకావటం లేదు.

కర్ణుడు: రంగభూమి అస్త్రవిశారదులకందరికీ సామాన్యం. మీ గురువుగారి మూడు లోకాలప్రశంసకు అర్థమేమిటి? చేతనైన-

అర్జునుడు: సరే, కాచుకో.

కర్ణుడు: సరే, ఇదిగో.

(బాణప్రయోగం)

తెరలో కలకలం

వంది మాగధులు:

బరిమోదన్ చెలరేగి వీరసమరావేశమ్ము నిండార కా
కిరి కర్ణార్జునులొండొరల్ కినుకతో- క్రీడారణ క్షోని దు
స్తర నీరంధ్ర నిశాతసాయకతమస్సంఛన్న మయ్యెం దిగం
తరముల్ నిండెను ప్రేక్షక ప్రజలఆర్త ధ్వాన సంక్షోభముల్.

ద్రోణుడు: కర్ణాఽర్జునులారా! ద్వంద్వయుద్ధం చాలించండి. రాజమాత కుంతిమహాదేవి మూర్ఛపోయింది.

అర్జునుడు: ద్రోణాచార్య గురువర్యులకు నమస్కారం.

ద్రోణుడు: అర్జునా! విదురాదులు కుంతిమహాదేవికి శీతలోపచారాలు చేస్తున్నారు నీ వచటికి పోవచ్చు.

అర్జునుడు: మహాప్రసాదం.

దుర్యోధనుడు ప్రవేశించి: కర్ణాభిధేయా! జగదేకధనుర్ధరా! ఈ దుర్యోధనుని సుహృదభినందనములు అందుకో— నీ అత్యద్భుతపరాక్రమ ప్రదర్శనంతో ప్రేక్షాకాగారమంతా మూర్ఛపోయింది.

కర్ణుడు: సార్వభౌమనందనుని అవ్యాజప్రేమాదరాలకు నా కృతజ్ఞత.

దుర్యోధనుడు: మహావీరుడా!

కలకలలాడు సోగ తెలిగన్నుల రాచరికమ్ము ఠీవి క్రొం
జిలుగు వెలుంగుసోయగము చింది స్వయంప్రభ లీను నైజ కుం
డల కవచాలు దివ్యజననమ్మును చెప్పక చెప్పు ; ఏ పురా
కలితవిశేషపుణ్యములు కల్పెనో మాకు భవత్సమాగతిన్.

నీ కులగోత్రప్రత్యభిజ్ఞలు తెలిసికో సభాసదులైన సకల సామంత దండనాథులు, భీష్మ కృపాచార్యాదులు, చక్రవర్తి కుతూహలులై ఉన్నారు.

కర్ణుడు:

నేను రాధేయుడను సూతసూనుడ నభి
మానముకలదు విలువిద్యలోన నాకు
అభ్యసించితి బహుళ శ స్త్రాస్త్రచయము
పరశురాముని కృపచేత పార్థివేంద్ర.

ద్రోణుడు: దుర్యోధనా! దైవాను గ్రహంవల్ల కుంతీ మహాదేవి మూర్ఛనుండి తేరుకొన్నది.

దుర్యోధనుడు: గురుదేవా! అయిన ఇంక ద్వంద్వయుద్ధం తిరిగి సాగింపవచ్చుగదా.

ద్రోణుడు: వీలు లేదు — సూతనందనా! వివాహ విద్యావివాదాలు సాటివారిలోనేగాని తదితరులలో చెల్లుబడికాదు. కౌరవరాజకులాలంకారుడైన పార్థునితో యుద్ధం చేసే అర్హత

నీకు లేదు. కయ్యానికి కాలుత్రవ్వక రంగభూమివిడిచి తొలగిపోవటం ఉత్తమకర్తవ్యం.

భీముడు: ఓహో! కర్ణా! సూతపుత్రా! ఆగు; ఈ భీముని హితోపదేశం విన్నతర్వాత వెళ్ళవచ్చు. నీకు మా అర్జునుతో యుద్ధం ఎందుకు? నీ కులానికి సంస్కారానికి తగిన మంచిపని చెప్తాను విను. మా అర్జునుడికి ముఖ్య సారథివై రథం తోలు. మా దుర్యోధనుడు నీకు మంచి ఒక టోరకమైన చెర్నాకోల బహుమానంగా ఇస్తాడు.

దుర్యోధనుడు:

ఆశ్రితసోదరపరాక్రమభాగధేయా! అనివేయ
కవచకుండలాల కాంతులన్ గానవా?
వెర్రి మాటలేల భీమసేనా!
పెద్దపులినిగన్న పిల్లికూనగలదా
కుంతిపుత్రుల కిది వింతయౌనె!

గురుదేవా! శిష్యవాత్సల్యం ధర్మాన్ని కప్పింది.

పాలితవిక్రమక్రముడు భార్గవశిష్యుడు మీకు భీష్మభూ
పాలునకున్ సతీర్థ్యుడు సవాలును గైకొనివచ్చినన్ ధరా
పాలసుతుండు గాడని నెపంబిడి పల్లుదురయ్య, పార్థుతో
ఆలముసేయరాదని మహాత్మ వహించతురె పక్షపాతమున్.

ద్రోణుడు: సార్వభౌమనందనా! రాజమర్యాదలు కాపాడటం ఆచార్యధర్మం. చెప్పవలసిన విధి కావున చెప్పాము.

దుర్యోధనుడు: గురుదేవా! మహాత్ముల జన్మాలు విచిత్ర గర్భితాలు, ఆనన్యసామాన్యాలు—మహాపురుషుల జన్మ రహస్యాలు మహానదుల జన్మస్థలాలవలె అజ్ఞేయాలు. అగమ్యాలు, కృపాచార్య గాంగేయ జన్మరహస్యాలు దీనికి ప్రత్యక్ష నిదర్శనాలు. మహాశయా, భవదీయ చరిత్ర కూడా దీనికి అపవాదం కాదు—

ద్రోణుడు: వత్సా! నీవు ఉపన్యసించినధర్మం మాకు అవగత పూర్వం. అదుగో, చూడు. ప్రేక్షాణాగారంలోనుంచి రంగభూమికి దిగి కౌగలించుకొనే సూతునికి కర్ణుడు పాద నమస్కారం చేస్తున్నాడు.

దుర్యోధనుడు: సూతుడు ఎంత ధన్యుడోకదా! ఆచార్యవర్యా, రాజకులంలో పుట్టినవాడు, రాజ్య పరిపాలకుడు, రాజనామ గౌరవార్హులని మొన్ననే తామూ శలవిచ్చినారుకదా!

ద్రోణుడు: నిజమే — అయితే.

దుర్యోధనుడు: అయిన గురుదేవా! నేడు కౌరవసార్వభౌముని నిండుకొలువులో అత్యద్భుత పరాక్రమం ప్రదర్శించిన ఈ మహావీరుడు కర్ణునికి అంగరాజ్యం బహుమానంగా ప్రసాదించు చున్నాము; త్రిలోకైక వీరుడైన కర్ణుని సన్మానించటం కౌరవ సామ్రాజ్య సామాన్యధర్మం.

తెరలో

కౌరవరాజకుమార దుర్యోధన! <u>జై జై</u>

మహావీరకర్ణ! <u>జై జై</u>

దుర్యోధనుడు: బ్రాహ్మణ మహాశయులారా!

నేటి అస్త్రవిద్యాప్రదర్శనంలో అసమానవిద్యా వైదగ్ధ్యం చూపిన మహావీరుడు కర్ణుని కౌరవసామ్రాజ్యం వీరాభిషేక మర్యాదలతో గౌరవిస్తోంది. ఈ మహోత్సవ సముహూర్తంలో మీ ఆశీస్సులు ప్రసాదించండి—

తెరలో

శుభమస్తు, అవిఘ్నమస్తు, సమస్త మంగళావాప్తిరస్తు.

దుర్యోధనుడు: బ్రాహ్మణవరేణ్యులకు నమస్సులు, ఇవిగో కాంచన మణిమయాంబరాలు – నవరత్నస్థగిత స్వర్ణభూషణాలు - దానములుగా స్వీకరింప ప్రార్థన.

తెరలో

శతం జీవ శరదో వర్ధమాన ఇత్యభినగమో భవతి

శతమానం భవతి శతమైశ్వర్యం భవతి

శత మితి శతం దీర్ఘ మాయుః।

దుర్యోధనుడు: మహావీరుడా, జగదేకధనుర్ధరా! కర్ణా! భారత సామ్రాజ్య సార్వభౌములు నీ పరాక్రమం మెచ్చి, వీరాభిషేక మర్యాదలతో సమస్త రాజలాంఛనాలతో మణిమకుట కేయూరహారాది భుజకీర్తులతో అంగరాజ్యం ప్రసాదించారు. దయతో స్వీకరించు.

అందరు చూచుచుండగ ధరాధిపనామముతోటి అంగరా
జ్యేందిర కేలుగై కొని మహీసుర మంగళగీతి కాక్షతల్
చిందిన రాజచిహ్న మణిశిల్పకళావిలసత్ కిరీటమున్
మందమనోజ్ఞహాస ముఖమండలమెత్తి ధరింపు మౌళిపై.

కర్ణుడు: నాకు అంగరాజ్యపదవితో, దుర్యోధన రాజకుమారు నకు రాజరాజపదవి ప్రాప్తించినది.

తెరలో

జై జై

శతం జీవ శరదః